సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

◆ప్రజా సేవలో రెవెన్యూ కీలకం

◆కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సేవలో రెవెన్యూ వ్యవస్థ చాలా కీలకమని, ఈ శాఖలో విధులను నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత అధికారులను హెచ్చరించారు. మంగళవారం నాడు కలెక్టరేట్‌లో రీ సర్వే, ఎస్‌పిఒఎల్ఆర్ మ్యూటేషన్స్, ఇంటి స్థలాలు, స్పందన, వివిధ కోర్టు కేసుల పరిష్కారం, భూ సేకరణ తదితర అంశాలపై జిల్లా స్థాయి రెవెన్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రెవెన్యూ వ్యవస్థ చాలా కీలకమన్నారు. క్షేత్రస్థాయిలో వీఆర్వో నుంచి ఆర్డీవో వరకు అందరూ కష్టపడి పని చేసి ప్రజల్లో నమ్మకం కలిగే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ, సర్వే శాఖలు వేర్వేరు కాదని, రెండు ఒకటేనన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా కషి చేయాలన్నారు. కోర్టు కేసులు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా పనిచేయాలన్నారు. ఆర్డీవోలు, తహశీల్దార్లు సంబంధిత అధికారులు ప్రతిరోజూ సమస్యలపై సమీక్షించాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణంలో రెవెన్యూ శాఖ అధికారులు తగిన సహకారం అందించాలన్నారు. అన్ని లేఅవుట్ల అభివద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధ్రువీకరణ పత్రాలు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలకు స్థలం కేటాయింపు విషయంలో త్వరగతిన చర్యలు చేపట్టాలన్నారు. ధ్రువీకరణ పత్రాల మంజూరులో గోరంట్ల, మడకశిర, ఓడి చెరువు, కదిరి, పుట్టపర్తి, నల్లమాడ, బుక్కపట్నం, సోమందేపల్లి మండలాలు వెనుకబడి ఉన్నాయని ఇక్కడ పనుల్లో పురోగతి పెరగాలన్నారు. రీ ఓపెన్ అర్జీలకు సంబంధించి లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య, డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవానీశంకర్, ఆర్డీవోలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, తిప్పేనాయక్, డిఎస్ఒ వంశీకష్ణతో పాటు జిల్లాలోని తహశీల్దార్లు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామంతో డెంగీ నివారణ

ప్రజల భాగస్వామ్యం ద్వారానే డెంగీ వ్యాధిని నియంత్రించ వచ్చని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ డెంగీ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణపై జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగీ వచ్చేందుకు గల కారణాలు తెలుసుకుని, వాటి నివారణకు చేపట్టవలసిన జాగ్రత్తలు గురించి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. దోమలు సంతానోత్పత్తి చేసేందుకు వీలులేకుండా కచ్చితంగా పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. వారంలో రెండు పర్యాయాలు పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వైద్యశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన వివిధ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఎస్‌వి.కష్ణారెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ వెంకటరామరెడ్డి, డీఆర్డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, డీఈవో మీనాక్షి, ఐసిడిఎస్ పీడీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన పంచాయతీరాజ్ పనులు

◆23 శాతం పనులు ఆరంభానికి నోచుకోని వైనం

◆ఎక్కడికక్కడే ఆగిన బల్క్ కూలింగ్, డిజిటల్ లైబ్రరీలు

◆రైతు భరోసా కేంద్రాల పరిస్థితి అదే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కీలకంగా వ్యవహరించేది పంచాయతీరాజ్ శాఖ. రహదారులు మొదలుకుని అనేక రకాలైన ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి పనులను ఈ శాఖనే పర్యవేక్షిస్తుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ శాఖ పరిధిలో జరుగుతున్న పనులు నత్తనడకనే సాగుతున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సైతం ముందుకు నడవటం లేదు.

ఆరంభానికే నోచుకోని 23 శాతం పనులు

అనంతపురం జిల్లా పరిధిల్లో స్పీల్ వర్క్స్ అంటే 2022-23 ఆర్థిక సంవత్సరం కంటే ముందు మిగులున్న పనులు 3686 ఉన్నాయి. వీటికి అదనంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో 73 పనులు మంజూరయ్యాయి. మొత్తం కలిపి 3759 పనులు గత ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందున్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు పూర్తయిన పనులు చూస్తే 1191 మాత్రమే పూర్తయ్యాయి. అంటే మొత్తంగా 31 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. తక్కిన వాటిల్లో 1684 పనులు ఇంకా పురోగతిలోనున్నాయి. ఇక పూర్తిగా ప్రారంభానికి నోచుకోనివి 884 పనులున్నాయి. అంటే 23 శాతం పనులకు ఇంకా పునాదిరాయి కూడా పడలేదు.

ప్రతిష్టాత్మక పనులు సైతం...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలకు సంబంధించిన పనులు సైతం నత్తనడకనే సాగుతున్నాయి. జగనన్న పాల వెల్లువ కార్యాక్రమంలో కీలకమైన బల్క్‌మిల్క్ కలెక్షన్ కేంద్రాల నిర్మాణం జిల్లాలో 125 చేపట్టాలన్నది లక్ష్యంకాగా ఇప్పటి వరకు పూర్తయింది నాలుగు మాత్రమే. 13 కేంద్రాలు పురోగతిలోనున్నాయి. తక్కిన 108 కేంద్రాల నిర్మాణం ఆరంభానికే నోచుకోలేదు. అదే విధంగా డిజిటల్ లైబ్రరీల నిర్మాణం 136కు నిర్మాణం చేపట్టాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు కట్టింది కేవలం ఒక్కటి మాత్రమే. ఏడు పురోగతిలోనున్నాయి. తక్కిన 178 కేంద్రాల ఆరంభానికి నోచుకోలేదు. సిసి రహదారులు 1827 మంజూరవగా 511 పనులు ప్రారంభమే అవలేదు. రైతు భరోసా కేంద్రాల పరిస్థితి ఇదే రకంగా ఉంది. జిల్లాకు 411 కేంద్రాలు మంజూరయితే 139 మాత్రమే పూర్తయ్యాయి. 182 పురోగతిలోనున్నాయి. తక్కిన రెండు కేంద్రాలు ఆరంభమే కాలేదు. వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు 326కుగానూ 139 మాత్రమే పూర్తయ్యాయి. గ్రామ సచివాలయాలు 469లకుగానూ 301 పూర్తయ్యాయి. తక్కినవి పెండింగులోనున్నాయి.

రూ.63.08 కోట్లు బకాయిలు

పైన పేర్కొన్న పనులన్నీ కలిపి రూ.356.71 కోట్లు పనులు జరిగాయి. ఇందులో రూ.293.63 కోట్లు చెల్లింపులు జరిగాయి. తక్కిన 63.08 కోట్లు బకాయిలున్నాయి. ఇందులో గ్రామ సచివాలయాలకు సంబంధించి రూ.11.64 కోట్లు ఉన్నాయి. సిసి రోడ్లకు సంబంధించి రూ.19.76 కోట్లు, రైతు భరోసా కేంద్రాలకు సంబంధించిన బిల్లులు రూ.9.68 కోట్లు, ఎఎంసి రోడ్ల బిల్లులు రూ.8.05 కోట్లు ఇలా అన్ని రకాల పనులకు సంబంధించి రూ.63.08 కోట్లు బకాయిలున్నాయి. ఈ బకాయిలు చెల్లింపులో నిర్లక్ష్యం కారణంగా పనుల్లో వేగం తగ్గినట్లు కన్పిస్తోంది.

ప్రజాసమస్యల పరిష్కారానికే 'గడపగడపకూ మన ప్రభుత్వం'

గోరంట్ల రూరల్ : ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం చూపడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామని స్థానిక ఎమ్మెల్యే మాల గుండ్ల శంకర్ నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం గోరంట్ల మండలం పాలసముద్రం పంచాయతీ పరిధిలోని కాటేపల్లి, రాగి మేకల పల్లి, సాములపల్లి గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని అక్కడే ఉన్న అధికారులకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, ఫక్రుద్దీన్ సాహెబ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బూదిలి వేణుగోపాల్ రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, వైసీపీ నాయకులు సామలపల్లి రాము, పాలసముద్రం సర్పంచి గంగప్ప, గోవిందరెడ్డి, గుంతపల్లి నర్సిరెడ్డి, విజయసింహారెడ్డి, సమరసింహారెడ్డితో పాటు వైసీపీ నాయకులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మీ ఇంటికి వచ్చాం... సమస్యలు ఉంటే చెప్పండి అని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి గ్రామస్తులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని గాండ్లపెంట సచివాలయం పరిధిలోని నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీ ఇంటి గడపకు వచ్చాం సమస్యలు ఉంటే తమకు చెప్పండని ఆయా కాలనీప్రజలను కోరారు., ఈ సందర్భంగా పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబందిత అదికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి. అంజనప్ప వీఆర్వో అమానుల్లా, ఎపిఎం సూర్యనారాయణ, ఎంపిఒ మంజునాథ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, ఎంపీపీ తాతం జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు ఎస్పీ హైదర్, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఫయాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

టిడిపి రాష్ట్ర సాధికార సమితి సభ్యులుగా సుధాకర్

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి పట్టణం కుటాగులకు చెందిన సుధాకర్ యాదవ్‌ను టిడిపి రాష్ట్ర సాధికార సమితి కమిటీ సభ్యులుగా నియమిస్తూ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్‌ను సుధాకర్ యాదవ్ కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ టిడిపిలో సామాన్య కార్యకర్తగా పనిచేస్తున్న తనను కందికుంట వెంకట ప్రసాద్ గుర్తించి ఈ అవకాశం కల్పించారని అన్నారు. నియోజకవర్గంలో టిడిపిని పూర్వవైభవం తీసుకురావటానికి కందికుంట వెంకటప్రసాద్ గెలుపునకు కృషి చేస్తానన్నారు. బీసీల సమస్యలను గుర్తించి పార్టీకి తెలియజేస్తానని చెప్పారు.



కందికుంటను సన్మానిస్తున్న నాయకులు

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

యువత గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు బానిస కాకుండా బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని టిడిపి నాయకులు కోరారు. మంగళవారం స్థానిక హనుమాన్ సర్కిల్ లో టిడిపి జిల్లా కార్యదర్శి సామ కోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీ తెలుగు యువత ప్లకార్డుల ద్వారా యువత మేలుకో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు ఏరులై పారుతున్నాయన్నారు. వాటికి బానిసై యువత చాలామంది పెడత్రోవ పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు అక్రమార్కులు మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నారని వాటిని పోలీసులు అరికట్టాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వాడటం వల్ల కలిగే నష్టాలను వివరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అమ్మినేని కేశవ నాయుడు, శ్రీనివాసులు, పాపా రెడ్డి, మహేష్, వెంకటేష్, నరసింహులు, వెంకట నాయుడు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

తహశీల్దార్లతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

వేగవంతంగా భూసేకరణ

జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వివిధ జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియపై నిర్లక్ష్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, వివిధ జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తిగా చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా ఇంకా 127 హెక్టార్లకు సంబంధించి భూములు సేకరించిన రైతుల బ్యాంక్ అకౌంట్ల వివరాలు, ఆధార్ కార్డుల వివరాలను త్వరగా అందజేయాలన్నారు. బ్యాంక్ అకౌంట్ల వివరాలు, ఆధార్ కార్డుల వివరాలు అందిస్తే రైతులకు వేగవంతంగా పరిహారం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో వివిధ జాతీయ రహదారులకు సంబంధించి ఎలాంటి పెండింగ్ లేకుండా భూసేకరణ చేపట్టాలని ఆదేశించారు. సకాలంలో భూసేకరణ పూర్తి చేసి రహదారుల నిర్మాణం వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్, పుట్టపర్తి, కదిరి ఆర్డీవోలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, కలెక్టరేట్ జి సెక్షన్ సూపరింటెండెంట్ బాలాజీ, ఆయా మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ

పుట్టపర్తి మండలంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్ఒ, తదితరులు

పుట్టపర్తి రూరల్ : సమర్థవంతమైన సమాజ భాగస్వామ్యంతోనే డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చునని శ్రీ సత్య సాయి జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ సందర్భంగా పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యనమల పల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత, పౌష్టికాహారం తీసుకోవాలని ,ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. డెంగ్యూ వ్యాధి నివారణకు దోమలు అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం గణేష్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కుల్లాయప్ప నాయక్, డాక్టర్లు జోష్ణ, ఫణీంద్ర సాయి, సిహెచ్ఒ నగేష్, ఎఎంఒ లక్ష్మీనాయక్, ఎస్‌యుఒ రమణయ్య, సూపర్వైజర్లు రామమోహన్, చంద్రకళ, నాగరత్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మడకశిర మండల పరిధిలోనే ఎచ్ ఆర్ పాలెం గ్రామంలో మంగళవారం జాతీయ డెంగి దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా మలేరియా సబ్ డివిజన్ అధికారి కోదండరామిరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవిత సత్యనారాయణ రెడ్డి, ఎఎన్ఎం అనిత, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

లేపాక్షి : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం లేపాక్షిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ రాబోవు వర్షాకాలం నందు ప్రజలు డెంగ్యూ, మలేరియా, విష జ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ హుస్సేన్‌బీ, ఎంపిహెచ్ఒ సుబ్రమణ్యం, హెల్త్ సూపర్వైజరు గోవిందప్ప, ఎఎన్ఎం ముత్యాలమ్మ, ఆశా కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులదేవర చెరువు : జాతీయ డెంగ్యూ దినోత్సవంలో భాగంగా స్థానిక ఆరోగ్య వైద్యశాల నుండి వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య వైద్యాధికారి ఐనుద్దీన్ కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ లాలు నాయక్, సిహెచ్ఒ సుభాషిణి, సూపర్‌వైజర్ మురళి, మద్దిలేటి మనోహర్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిగి : మండలాన్ని మలేరియా రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పని చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్వరూప రెడ్డి పిలుపునిచ్చారు. సీజనల్ వ్యాధులు కాకుండా డెంగీ వ్యాధులు సోకితే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నాటక రూపంలో అవగాహన కల్పించారు. మండలంలోని శ్రీరంగరాజు పల్లిలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారులు మాట్లాడుతూ డెంగీ వ్యాధి లక్షణాలు కన్పించిన వెంటనే సంబంధిత డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమాన్ని పెనుకొండ ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మంజువాణి తనిఖీ చేసి అవగాహన కార్యక్రమం పట్ల సంతప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ వన్నప్ప, ఎంఎల్‌హెచ్‌పి షబానా తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : డెంగ్యూ వ్యాధినికలిసికట్టుగా అరికడదామని మలేరియా సబ్‌యూనిట్ అధికారి రాంనాయక్ పేర్కొన్నారు.

ధర్మవరంలో నిర్వహిస్తున్న ర్యాలీ

జాతీయ డెంగ్యూదినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యసిబ్బంది. అంగన్వాడీ, ఆశాకార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఆస్పత్రి నుండి ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించి డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి చంద్రిక ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది జాతీయ డెంగ్యూవ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : మండలంలో వైద్యాధికారి మనోహర్ నాయక్ ఆధ్వర్యంలో డెంగ్యూపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అధికార పార్టీలో అసమ్మతి

◆ కదిరి వైసిపిలో కోల్డ్‌వార్ ◆ తారాస్థాయికి చేరిన వర్గ పోరు ◆ నియోజకవర్గంలో మూడు గ్రూపులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి ఎమ్మెల్యే తీరుపై ఆపార్టీ నాయకుల్లోనే విమర్శలు తారాస్థాయిలో ఉన్నాయి. నియోజకవర్గంలో ఆపార్టీలో కోల్డ్‌వార్ నడుస్తోంది. నాయకులు మూడు గ్రూపులుగా విడిపోయారు. వారి మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరకుంది. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో నానాటికి అసమ్మతి పెరుగుతుండటంపై పార్టీ మనుగడపై ఆపార్టీ నాయకుల్లోనే ఆందోళనలు నెలకొన్నాయి.

వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలన్న సంకల్పంతో పులివెందుల నియోజవర్గం పక్కనే ఉన్న కదిరి నియోజవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు 2019 ఎన్నికల్లో ఎంతో కష్టపడ్డామని ఎమ్మెల్యేగా సిద్ధారెడ్డిని గెలిపించామని వైసిపి స్థానిక నాయకులు చెబుతున్నారు. గెలిచిన కొన్నాళు మౌనంగా ఉన్న సిద్ధారెడ్డి అసలు రూపం బయటపడిందని ఆపార్టీ అసమ్మతి నాయకులు విమర్శిస్తున్నారు. వృత్తిరీత్యా డాక్టర్ అయిన సిద్ధారెడ్డి వ్యాపారం, ఆదాయమే లక్ష్యంగా నియోజకవర్గ వ్యాప్తంగా కాంట్రాక్టులు పనులు చేసుకుంటూ. కమర్షియల్ ఎమ్మెల్యేగా మారిపోయి గెలిపించిన సొంత పార్టీ కార్యకర్తలను విస్మరించారనిఆ పార్టీ దిగువ శ్రేణి నాయకులు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. నియోజక వర్గంలో చిన్నపాటి పనులు కూడా ఆ ప్రజాప్రతినిధి చేసుకుంటున్నారని ఆ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. 'ఇక మాకొద్దు బాబోయ్ ఈ ఎమ్మెల్యే' అని ఆ పార్టీ శ్రేణులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

కదిరి వైసిపిలో కోల్డ్‌వార్

కదిరి అధికార పార్టీలో నాయకుల మధ్య కోల్డ్ వార్ సాగుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే సిద్ధారెడ్డి వైఖరిపై వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పూల శ్రీనివాసులు రెడ్డి పలుమార్లు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే సొంత పార్టీ కార్యకర్తలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని మండలాల్లో పార్టీకి అనుకూలంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారని పూల శ్రీనివాసులు రెడ్డి ఒకానొక దశలో సిద్ధారెడ్డి పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అప్పటి మంత్రి శంకర్నారాయణ సమక్షంలో సిద్ధారెడ్డిపై ఫిర్యాదు చేశారు.

నియోజవర్గంలో మూడు గ్రూపులు

నియోజవర్గంలో అధికార పార్టీ వైసిపిలో మూడు గ్రూపులు ఉండడంతో ఆ పార్టీ కార్యకర్తలు ఎవరి దగ్గరికి వెళితే ఏమవుతుందో అన్న అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పూల శ్రీనివాసరెడ్డి ఉంటారని ఆయన వర్గీయులు బహిరంగంగా చెబుతున్నారు. మరోవైపు బీసీ నాయకులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ నియోజకవర్గ వ్యాప్తంగా సహాయ సహకారాలు చేస్తూ ప్రజల మనసులో చోటు సంపాదించుకుంటున్నారు. ఈసందర్భంగా ఆయన వైసిపి నాయకులను కార్యకర్తలను కలిసి తనకు మద్దతు ప్రకటించాలని కోరుతున్నట్లు సమాచారం. మరోసారి తనకే టికెట్ వస్తుందని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రస్తుత ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఆయన వర్గీయులకు తెలిపినట్లు విశ్వసనీయ సమాచారం.

కదిరి మున్సిపాలిటీలో వైసిపికి గడ్డు పరిస్థితే...

కదిరి మున్సిపాలిటీలో వైసిపికి వచ్చే రోజుల్లో గడ్డు పరిస్థితి ఎదురవనుందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. మున్సిపాలిటీ ఎన్నికల అనంతరం వైసిపి పట్టణ అధ్యక్షులు బహువుద్దీన్ ఎమ్మెల్యే అవినీతి అక్రమాలపై పలుమార్లు ప్రశ్నించారు. మీడియా ముందుకు వచ్చి విమర్శలు గుప్పించారు. కుటాగుళ్లలో నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి సిద్ధారెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.కదిరి నియోజవర్గంలో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ సలహాదారుడు సజ్జలకు ఎమ్మెల్యే అవినీతి అక్రమాలపై అసమ్మతి నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం వైసిపి లీగల్ సెల్ నాయకులు లింగాల లోకేశ్వర్ రెడ్డి మీడియా ఎదుటకు వచ్చి ఎమ్మెల్యే అవినీతి అక్రమాలు పార్టీకి నష్టం చేస్తున్న పరిస్థితిపై విమర్శించారు. మున్సిపాలిటీలో మరికొందరు నాయకులు ఎమ్మెల్యే తీరుపై విమర్శిస్తున్నారు.

నల్లచెరువులో ముదిరిన వర్గపోరు

తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న నల్లచెరువు మండలం గత సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి మెజార్టీ సాధించింది. అయితే గత నాలుగు సంవత్సరాలుగా అధికార పార్టీ ఆమండలంలో వెనుకబడింది. మరోవైపు పార్టీలో వర్గ పోరు తారాస్థాయికి చేరింది. రెండు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారుగా పార్టీ కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఒకానొక దశలో రోడ్డు పైకి వచ్చి ఆరోపణలు చేసుకున్న సందర్భం ఉంది.ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పై విమర్శలు గుప్పిస్తూ పార్టీకి కష్టపడిన కార్యకర్తలను విస్మరించారని ఇటీవల కొందరు తమ పదవులకు సైతం రాజీనామా చేసి ఆ పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. మరోవైపు ఎమ్మెల్యే వర్గీయులు మాత్రం విమర్శలను పట్టించుకోకుండా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇదిలా ఉండగా తనకల్లులో కూడా ఇదే పరిస్థితి ఉంది.తనకల్లు మండలంలో మండల పార్టీ నాయకుడిపై మరికొందరు కార్యకర్తలు నాయకులు విమర్శలకు దిగుతున్నారు. ఒంటెత్తు పోకడలతో పార్టీని నష్టపరుస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో పూల శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ బత్తల హరిప్రసాద్ తనకల్లు మండలంలో పర్యటించి అసమ్మతి నాయకులతో సమావేశం ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఇక గాండ్లపెంట, ఎన్‌పి కుంట మండలాల్లో కూడా ఎమ్మెల్యే వైఖరి పై ఆ పార్టీ నాయకులు విమర్శలకు దిగుతున్నారు. తలుపుల మండలంలో అధికార పార్టీలో వర్గ పోరు రోజు రోజుకి చాప కింద నీరులా విస్తరిస్తోంది. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో వర్గ పోరు నెలకొంది. వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పూల శ్రీనివాసులు రెడ్డి సొంత మండలం కావడంతో ఆయన వర్గీయుడిని ఎంపీపీగా చేసేందుకు సర్వం సిద్ధం చేయగా ఎమ్మెల్యే సిద్ధారెడ్డి కల్పించుకొని పూర్తిస్థాయిలో మెజారిటీ లేకపోయినప్పటికీ అధికార బలంతో తన వర్గీయుడిని ఎంపీపీ చేయడంతో వర్గ పోరు మరింత తీవ్రస్థాయికి చేరుకుంది. ఈనేపథ్యంలో కదిరి అధికార పార్టీలో నెలకొన్న వర్గపోరుపై అధిష్టానం సీరియస్ అయినట్లు సమాచారం.

ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రతినిధులు

ప్రాంగణ నియామకాలు

పెనుకొండ : పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రాంగణ నియామకాలను చేపట్టారు. ప్రముఖ కంపెనీలైన జస్ట్ డయల్, బెంగళూరుకు చెందిన ఆల్ సెక్ టెక్నాలజీ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో మొత్తం 54 మంది నిరుద్యోగులు హాజరవ్వగా ఇందులో ఏడుగురిని ఎంపిక చేశారని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి తెలిపారు. ఈ ఇంటర్వ్యూలను ఆయా కంపెనీల డైరెక్టర్లు రఘురాం, అనంత, ఇంటర్వ్యూ కోఆర్డినేటర్ బాబా ఫక్రుద్దీన్, కళాశాల ఏవో కేశవయ్య నిర్వహించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఓబుల దేవర చెరువు: స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న మెడికల్ స్టోర్ వద్ద ఉచిత కంటి, దంత చికిత్స శిబిరాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు మెడికల్ స్టోర్ యజమాని ఫిరోజ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటల నుండి, కంటి వైద్యుడు ముజఫర్, దంత వైద్యుడు కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి బుధవారం ఇక్కడ ఉచిత కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎనుములపల్లిలో గంగమ్మజాతర

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి మండల పరిధిలోని ఎనుములపల్లిలో గ్రామ దేవత గంగమ్మకు మంగళవారం బోనాలను సమర్పించారు. పుట్టపర్తి చిత్రావతి నది తీరాన గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని తొలుత గ్రామంలో ఊరేగించారు. ఐదు సంవత్సరాల అనంతరం నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పుట్టపర్తి అర్బన్ సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఐ రమణ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

ఉపాధి బిల్లుల పేస్లిప్‌లు ఇవ్వండి

సోమందేపల్లి : మండల పరిధిలోని నాగినేని చెరువుకు చెందిన కూలీలకు చెందిన ఉపాధి హామీ బిల్లుల రసీదులను ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి కోరారు. ఈయన ఆధ్వర్యంలో నాయకులు, కూలీలు మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వరావుకు మంగళవారం వినతి పత్రం అందించారు. స్పందించిన ఎంపీడీవో ఉపాధి హామీ బిల్లులు ప్రతి ఒక్క ఫీల్డ్ అసిస్టెంట్ ఏ వారానికి సంబంధించిన ఆవారానికి రశీదులను కూలీలకు వెంటనే చెల్లించాలని ఆదేశించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హిందూపురం : పట్టణంలోని శ్రీకంఠాపురం వద్ద ఉన్న పెద్దమ్మ దుర్గమ్మ, సుంకలమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు అమ్మవారికి జ్యోతులతో మహిళలు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు అంబికా లక్ష్మీనారాయణ, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు, నాయకులు దుర్గా నవీన్, పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్ తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ మంజుళ, టిడిపి మహిళా విభాగం రాష్ట్ర నాయకులు పరిమళచ పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆహ్లాదాన్ని ఇవ్వడానికే వేసవి విజ్ఞాన శిబిరాలు

బత్తలపల్లి : వేసవి సెలవులలో విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపడానికే గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని శాఖ గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉపయోగకరమైన విజ్ఞానాన్ని అందించే ఇంగ్లీషు భాషలో మెరుగైన శిక్షణ, తెలుగు, చిత్రకళలు, వ్యక్తిత్వ వికాసం, తదితర వాటిపై ప్రత్యేక నిష్ణాతులైన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం పట్ల ఆమె సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి, టీచర్ రేష్మ,తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యాడికి : జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 2022-23 విద్యా సంవత్సరంలో జిల్లాలో గుర్తించిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం, బాలికలకు 33 శాతం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు రిజర్వేషన్ వర్తింపు ఉందన్నారు. ఈనెల 31వతేదీలోగా దరఖాస్తులను పంపాలని కోరారు.

ఎంఇఒపై చర్యలకు ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

ప్రజాశక్తి - కొత్తచెరువు

తప్పుడు నివేదిక ఇచ్చిన కొత్తచెరువు ఎంఇఒ వెంకటరమణా నాయక్‌పై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పవన్, నరసింహులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తచెరువులోని శివ సాయి డిగ్రీ, జూనియర్ కళాశాలో నిబంధనలకు విరుద్ధంగా , నారాయణ పాఠశాలను ఏర్పాటు చేశారని వారి పైన చర్యలు తీసుకోవాలని మార్చి 27వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. దీంతో డీఈవో మీనాక్షి వాటిపైన నివేదిక ఇవ్వాలని ఎంఇఒను ఆదేశించగా నెల రోజులు అయినా ఇవ్వలేదన్నారు. అనంతరం తప్పుడు నివేదికను ఆమెకు అందజేశారన్నారు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నారాయణ పాఠశాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని, అలాగే ఎంఇఒ వెంకటరమణా నాయక్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న గంగమ్మ దేవాలయ అభివృద్ధికి పలువురు విరాళం అందజేశారు, వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి 20వేల రూపాయల నగదును మంగళవారం గొల్లపల్లిలోని ఆలయం వద్ద ఆలయ నిర్మాణ నిర్వాహకులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, చింతకాయల అంజి, ఈశ్వర్, ఎమ్మార్పీఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న వైస్ ఛైర్మన్

సమస్యలపై సకాలంలో స్పందించండి

ప్రజాశక్తి-హిందూపురం

సచివాలయాల పరిధిలో ప్రజలు ఫిర్యాదు చేసిన సమస్యలపై సకాలంలో స్పందించి వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి వైస్ చైర్మన్ బలరామిరెడ్డి ఆదేశించారు. మంగళవారం 14వ వార్డు పరిధిలో ఉన్న హౌసింగ్ బోర్డ్ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించిన అనంతరం ఫిర్యాదుల పుస్తకంలో రిజిస్టర్ అయిన ఫిర్యాదులపై ఆయన సమీక్షించారు. వార్డ్ వాలంటీర్ల ద్వారా సమస్యలను తెలుసుకొన్నారు. ఆ సమస్యలను వెంటనే పరిష్కరించడానికి ఋషి చేయాలని సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో కలిసి వార్డులో ఉన్న ఉద్యానవనాన్ని పరిశీలించారు. ఉద్యానవనంలో ఉన్న సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బికెలకు చేరిన విత్తన వేరుశనగ

నల్లచెరువు : మండల పరిధిలోని రైతుభరోసా కేంద్రాలకు విత్తన వేరుశనగ చేరింది. ఎం. అగ్రహారం రైతు భరోసా కేంద్రంలో 334 సంచులు, చెవిటి వారి పల్లి పి. కొత్తపల్లి, లోని రైతు భరోసా కేంద్రానికి 334 సంచుల విత్తన వేరుశనగ మంగళవారం చేరింది. ఈ సందర్భంగా వ్యవసాధికారి భారతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర 30 కిలోల సంచికి 2,790 రూపాయలు కాగా సబ్సిడీ పోను 1674 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని, ప్రతి రైతుకు మూడు సంచుల చొప్పున ప్రభుత్వ ఆదేశాలు మేరకు త్వరలోనే పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

గుడిబండ : మండల వ్యాప్తంగా ఈనెల 27 నుంచి ప్రభుత్వం రైతులకు పంపిణీ చేస్తున్న సబ్సిడీ వేరుశనగ కోసం స్థానిక ఆర్‌బికెల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకొనేరైతులు తమ పట్టాదారు పాసు పుస్తకంతో పాటు. ఆధార్ కార్డు జిరాక్స్ మొబైల్ నెంబర్ ను తీసుకెళ్లి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఒక క్వింటాల్ సబ్సిడీ ధర 5, 580 రూపాయలు ఉంటుందని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఈనెల 27 నుంచి వేరుశనగను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. మండల వ్యాప్తంగా రైతులకు పంపిణీ చేయడానికి ఇప్పటికే 300 క్వింటాళ్లు సబ్సిడీ వేరుశనగను గుడిబండ వ్యవసాయ కార్యాలయంలో సిద్ధంగా ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. ఇదే కాక మరో 300 క్వింటాళ్లు వేరుశనగ త్వరలోనే గుడిబండకు చేరనున్నట్లు వివరించారు. రైతుల అవసరాలను బట్టి వేరుశనగను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వార్డులో పర్యటిస్తున్న ఛైర్‌పర్సన్, తదితరులు

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు హిందూపురం మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ అన్నారు. అ మేరకు ఆమె మంగళవారం పురపాలక సంఘంలో పలు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత 14 వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆ ప్రాంత ప్రజలు వార్డులో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆమె పోచనపల్లిలో రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించి వెంటనే శుభ్రం చేయించాలని పర్యావరణ పరిశుభ్రత కార్యదర్శికి ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె చిన్నారులకు అందాల్సిన ప్రతి ఒక్కటి సక్రమంగా అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ నీరజ, వైసీపీ నాయకులు జెకె ఆనంద్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అదనంగా ఏడు పీజీ సీట్లు మంజూరు

ప్రజాశక్తి-అనంతపురం

2023-24వ సంవత్సరానికి అనంత వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగానికి జాతీయ వైద్య మండలి (నేషనల్ మెడికల్ కమిషన్) అదనంగా మరో ఏడు పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రిన్సిపల్ ఆరేపల్లి శ్రీదేవి తెలిపారు. ఈమేరకు అదనపు సీట్లు మంజూరు కావడం పట్ల మైక్రో బయాలజీ సిబ్బంది మంగళవారం మెడికల్ కళాశాలలోని ప్రిన్సిపల్ ఛాంబర్‌లో ప్రిన్సిపల్ శ్రీదేవిని కలిసి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుతం ఏడు సీట్లు పెరగడంతో మొత్తం 11 పీజీ సీట్లు అవుతాయన్నారు. ఇన్ని పీజీ సీట్లు రావడంలో మైక్రోబయాలజీ విభాగాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విఆర్‌డిఎల్, ఎస్ఆర్ఎల్, వైరల్ లోడ్ సెంటర్, సిడి4, ఐసీటీసీ, పిపిటిసిటి, వైరల్ హెపటైటిస్ శాఖల సమన్వయ కృషి ఫలితమే అన్నారు. మైక్రో బయాలజీ సహాయ విభాగాధిపతి ఆర్.హైమావతి మాట్లాడుతూ రాష్ట్రంలో స్విమ్స్ ఆసుపత్రి తర్వాత కోవిడ్ పరీక్షలు నిర్వహించిన మొట్టమొదటి వైద్య కళాశాల అనంతపురం అన్నారు. అలాగే రాయలసీమ జిల్లాల్లో హెచ్ఐవి వైరల్ లోడ్ శాతాన్ని నిర్ధారించే పిసిఆర్ పరీక్షలు కూడా ఇక్కడే అందుబాటులో ఉన్నాయన్నారు. ఎట్టకేలకూ ఏడు సీట్లు పెంచుతూ అనుమతి ఇవ్వడంతో మంత్రి విడుదల రజినికి, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, వైద్య విద్య సంచాలకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైక్రో బయాలజీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్లు ఆర్.హైమావతి, వేముల సరోజ, మీనిగ శైలజ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లను వేధించిన బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేసిన ఆల్ ఇండియా రెజ్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మహిళా రెజ్లర్ల ఆందోళనలకు మద్దతుగా ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సీపీఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయం వద్ద నుంచి పొట్టి శ్రీరాములు కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేధింపులకు గురైనట్లు మహిళా రెజ్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తూ నిరసన తెలుపుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే బిజెపి ఎంపిని అరెస్టు చేయడంతోపాటు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శిలు శ్రీరాములు,చిన్నా , ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) నియోజకవర్గ కార్యదర్శి ఆశాబీ, పట్టణ కార్యదర్శి మాబూనీ, కమిటీ సభ్యులు బాషా, వీరేంద్ర, గోపీ, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాటజూదరులు అరెస్టు

రొద్దం : మండలంలోని శ్యాపురం గ్రామ శివార్లలో గల కంప చెట్ల వద్ద ఏర్పాటు చేసిన పేకాట స్థావరంపై ఎస్ఐ నాగస్వామి తన సిబ్బంది దాడులు చేసి జూదరులను అరెస్టు చేశారు. పేకాట ఆడిస్తున్న పేకాట ఆర్గనైజర్స్ అశోక్, రాజపుత్‌తో పాటు మొత్తం 16 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.53,410 నగదు, 6 మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు

ఆర్మీ మాజీఉద్యోగి ఆత్మహత్య

కనగానపల్లి : మండలంలోని కుర్లపల్లికి చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి ఎం.సూర్యనారాయణ (48)మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్లపల్లి నుండి చంద్రచర్ల వెళ్లే దారిలో విషపుగుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సూర్యనారాయణ రెండు సంవత్సరాల క్రితం ఆర్మీలో రిటైడ్ అయ్యి స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎం.సూర్యనారాయణకు ఇటీవల ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. వాటిని భరించలేక మంగళవారం ఉదయం ఆత్మహత్య చేసుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య ఆదినారాయణమ్మ, ఇద్దరుకుమారులు,కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపిటిసి మృతి

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ ఆర్.డి.టి. ఆసుపత్రి ఎదురుగా మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని రాకుంటపల్లి గ్రామానికి చెందిన ఎంపిటిసి ఈశ్వరయ్య (52) మృతిచెందాడు. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, మరో వ్యక్తి ఓబులేసు తమ సొంత పనిమీద ద్విచక్ర వాహనం లో కొక్కంటి గ్రాస్ వైపు వెళుతుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈశ్వరయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఓబులేసుకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్య చికిత్స కోసం బెంగళూరుకు తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తనకల్లు ఎస్ఐ రాంభూపాల్ యాదవ్ తెలిపారు.

మృతుడు ఈశ్వరయ్య

పుట్టపర్తిలో చోరీ

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలోని గణేష్ సర్కిల్ లో గల ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న టీ బంకులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం ఉదయం ఈ విషయం బయటపడింది. బాధితురాలు మాధవిచ పోలీసులు తెలిపిన వివరాలు... శిల్పారామం కాలనీలో నివాసం ఉంటున్న మాధవి బతుకుతెరువు కోసం గణేష్ సర్కిల్ లో టీ బంకు నడుపుకొంటోంది. ఈ బంకు ప్రధాన రహదారి ప్రక్కన, స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి నివాసం సమీపంలో ఉంది. ఫైనాన్స్ లో సోమవారం రూ. 20 వేలు తీసుకుని బంకులో పెట్టానని, బంకులు ఉన్న సిగరెట్లు, బీడీలు, మరో ఐదు వేలు నగదును దుండగులు ఎత్తుకెళ్లారని వాపోయింది. దీంతో తనకు మొత్తం రూ. 40 వేలు నష్టం జరిగిందని బాధితురాలు వాపోయింది. తనకు జరిగిన అన్యాయంపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది. ఎస్ఐ వెంకటేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

శాంతిభద్రతలపై చర్చిస్తున్న డిఐజి

అన్ని ప్రాంతాలపై నిరంతర నిఘా: డిఐజి

పెనుకొండ : పెనుకొండ పోలీస్ స్టేషన్‌ను అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ ఎన్ అమ్మిరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తును పరిశీలించారు. విజిబుల్ పోలీసింగ్, గ్రామాల సందర్శనలపై దృష్టిపెట్టాలని సూచించారు. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు.సమస్యాత్మక గ్రామాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తాజా పరిస్థితులపై దృష్టి సారించి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసు స్టేషన్లకు బాధలతో వచ్చే ప్రజలు సంతృప్తితో వెళ్లేలా చర్యలు ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలపై దృష్టి పెట్టాలని, మహిళలపై జరిగే నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ , మహిళా చట్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వారంలో ఒకరోజు పోలీసు స్టేషన్లో 'కాఫీ విత్ మెన్' కార్యక్రమం నిర్వహించి పోలీసు స్టేషన్ సిబ్బందిని, ఆ పరిధిలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పెనుకొండ సిఐ కరుణాకర్, కియా ఎస్ఐ వెంకటరమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

రొద్దం : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని టింబక్ట్ కలెక్టివ్ సంస్థ ప్రతినిధులు కోరారు. మండలంలోని చోలేమరి గ్రామంలో అనంతశక్తి సొసైటీ సిఇఒ లావణ్య ఆధ్వర్యంలో కిష్టమ్మ అధ్యక్షతన చట్టాలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత శక్తి సీఈవో లావణ్య, రజిని,మహాశక్తి లక్ష్మీదేవి తదితరులు మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. గృహహింస, బాల్య వివాహాలు, మద్యంపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి వైస్ ప్రెసిడెంట్ రామలక్ష్మమ్మ, న్యాయ సలహా కేంద్ర కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులను ప్రోత్సహించాలి

అమడుగూరు : విభిన్న ప్రతిభావంతుల ను ప్రోత్సహించాలని నారా లోకేష్‌కు విన్నవించుకున్నట్లు టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానుజులు నాయుడు తెలిపారు. సకలాంగులతో సమానంగా అభివద్ధి చెందడానికి విభిన్న ప్రతిభావంతులకు తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టాక ప్రత్యేకంగా ప్రోత్సాహం అందించాలని పాదయాత్రలో లోకేష్‌కు వినతి పత్రాన్ని అందించినట్లు ఆయన తెలిపారు.

స్పందించారు ... ప్రాణాన్ని కాపాడారు..!

హిందూపురం : పట్టణంలోని వన్ టౌన్ పోలీసులు సకాలంలో స్పందించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడారు. ఈ మేరకు వన్ టౌన్ సిఐ ఈరన్న తెలిపిన వివరాలు... పట్టణంలోని ముదిరెడ్డిపల్లికి చెందిన చేనేత కార్మికుడు రవి తన భార్యతో తరచుగా గొడవ పడేవాడు. ఈవిషయంపై మనస్థాపానికి చెందిన రవి మంగళవారం ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం చేశారు. దీనిని గమనించిన గుర్తుతెలియన వ్యక్తి 100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బ్లూ కోర్స్‌లో ఉన్నా షేక్షావలి వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న రవిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తీసుకెళ్లాడు. పోలీసులు అతని వివరాలను తెలుసుకొని, కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. సకాలంలో స్పందించి ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ షేక్షావలిని హిందూపురం డిఎస్‌పి కంజాక్షన్ నగదు బహుమతి అందజేశారు.

రివార్డు అందజేస్తున్న డీస్పీ